# చిన్నవాళ్లు చేసిన పెద్దపని

"అమ్మా, నాకు స్కూలుకు భోజనం పంపేటప్పుడు జ్ఞాపకం ఉంచుకుని రెండు చపాతీలు ఎక్కువగా పంపించు. నీవు పంపించేవి చాలటం లేదమ్మా'' అన్నాడు ప్రకాష్.

''చాలకపోతే వెంటనే చెప్పద్దూ? రోజూ అట్లాగే సగం ఆకలితో ఉంటు న్నావా? సర్లే. ఇవాళ టిఫిన్‌కారియర్ నింపేటప్పుడు నేను దగ్గరుండి పెట్టిస్తాను'' అన్నది నీరద. ఆమెకు కొడుకు సగంఆకలితో ఉంటున్నాడంటే చాలా బాధ కలిగింది. నౌకర్లతో పని చేయించుకున్నా దగ్గరుండాలి. పిల్లవాడికి కడుపునిండా భోజనం పంపటంలేదని వాడు చెప్పేవరకూ తనెందుకు ఊరుకుంది? సరిపోతుందో లేదో తను అడగవచ్చుగా? అది తెలివితక్కువ తనమో, లేక ఏమరుపాటో ఆమెకే తెలియలేదు. కళ్ళు చెమ్మగిల్లాయి.

మరునాడు డ్రైవరుతో పంపేటప్పుడు దగ్గరుండి టిఫిన్‌కారియరు పెట్టించి పంపింది. "అబ్బాయి భోజనం చేసేవరకూ ఉండు" అని మరీమరీ చెప్పింది.

"ఎక్కువ పెట్టింది కదా, నేను సైకిల్‌కి తగిలించుకుని తెస్తాలే టిఫిన్ కారియర్. నీవు వెళ్ళు'' అంటూ డ్రైవర్ని పంపించేశాడు ప్రకాష్.

ప్రకాష్ తండ్రికి ఆ ఊరు బదిలీఅయి రెండేళ్ళయింది. ఈ రెండేళ్ళనుంచీ ఆ హైస్కూల్లోనే చదువుతున్నాడు.

ఒకరోజు స్కూలు వదిలిపెట్టిన తరువాత, గేటులోనుంచి సైకిల్ మీద టిఫిన్‌కారియర్ తగిలించుకుని వెళ్తున్నాడు.

''బాబయ్యా, ఆ టిఫిన్‌డబ్బాలో ఏదైనాఉంటే నాకు పడెయ్యండి" అంటూ చేతులు చాచాడు, ఒకపిల్లవాడు.

అప్పటికి సైకిలు రెండు అడుగులు ముందుకు వెళ్ళిపోయింది. కాని ఆ పిలుపుకు ప్రకాష్ సైకిలాపి అతడికి సమీపంగా వెనక్కు తీసుకువెళ్లాడు.

పదిహేను సంవత్సరాల పిల్లవాడు లేచినిలబడలేని స్థితిలో చేతులుచాపి "ఆ డబ్బాలో ఏమయినా ఉంటే పడెయ్యండి బాబూ'' అన్నాడు మళ్ళీ.

చప్పున సైకిలికి స్టాండువేసి టిఫిన్‌కారియరు తెరిచి "కొంచెం పెరుగన్నం. కూర మిగిలాయి తీసుకో. రేపు ఇంకా ఎక్కువ పెడతాలే, ఇక్కడే ఉంటావా?" అన్నాడు టిఫిన్‌కారియర్ తుడిచి, అతడి చేతిలో పడేసి చేతి గుడ్డతో తుడుచుకుంటూ.

''ఇక్కడే ఉంటాను బాబూ'' అన్నాడు.

''నీ పేరు ?"

"నా పేరు రామన్న బాబూ.''

''అయితే పొద్దుటినుంచీ నీవేంతినలేదా ?"

''వేరుసెనగల బండి ఆయన దోసెడు కాయలు పెట్టాడు. అవి ఒలుచుకుని తిన్నాను బాబూ.''

వాటితోటి కడుపు నిండుతుందా అనుకుని "రేపు నేను తినేవేళకు ముందు నీకిచ్చి నేను తింటాను. రోజూ నీకుకూడా తెస్తాలే'' వెనక్కుతిరిగి "మరి రాత్రికేం తింటావు ?'' అడిగాడు.

''ఎవరైనా ఇస్తే తింటాబాబూ, ఒకోనాడు ఏమి దొరకదు."

''నీకెవరు లేరా ?''

''కన్నవాళ్ళు లేరు చుట్టాలింటికాడ పడుకుని పొద్దటినుంచీ బైట అడుక్కుంటా" రామన్న తలవంచుకున్నాడు.

ప్రకాష్ జేబులో చెయ్యిపెట్టి చూశాడు. రూపాయి కాగితం ఎనిమిదణాల బిళ్ళ చేతికి తగిలింది. అతడికిచ్చి "రాత్రికేమయినా కొనుక్కుని తిను'' అంటూ వెళ్ళిపోయాడు.

ఆ మరుసటి రోజునుంచీ తల్లికి రెండు రొట్టెలెక్కువ పెట్టమని చెప్పాడు.

మరుసటిరోజు రామన్నకు ప్రకాష్ ముందే రొట్టెలు కూర ఇచ్చి, తనాక చెట్టుకింద కూర్చుని తిన్నాడు. ఇంటికి వెళ్ళేటప్పుడు అతడికోసం తెచ్చిన రెండు రూపాయల కాగితం ఇచ్చాడు.

''ఎక్కడ తింటావు.''

''ఆ పక్కకు హోటల్ ఉంది. రెండు బన్‌లు ఒక చాయికప్పు ఇస్తాడు. తిని ఇంటికిపోతా.''

ఆ మాట్లాడినంతటిలో రామన్న మోకాళ్ళకు కాయలుకాసినట్టు కనిపెట్టాడు ప్రకాష్. మోకాళ్ళ కిందినుంచి సన్నగా అయిపోయాయి కాళ్ళు. అందుకని రోడ్డు మీద కూడా పాకుతాడు. ఒంటికి సరియైన చొక్కా లేదు. మాసి చినుగుపట్టిన నిక్కరు ఒక బనియను ఉన్నాయి ఒంటిమీద.

ముఖం నవనవలాడుతూ నిండుగా ఉండాలి ఆ ఈడు పిల్లలకు. కాని రామన్నకు కళ్ళు లోతుకుపోయాయి. ముఖం పీక్కుపోయి ఉంది.

ప్రకాష్‌కి ఆరాత్రి రామన్నను గురించే ఆలోచనలు రావటం మొదలు పెట్టాయి. ఒంటికి గుడ్డలు లేవు, కడుపుకు తిండిలేదు, నడవలేడు. చుట్టాలింట్లో పడుకుంటానంటున్నాడు గాని ఏచుట్టం రానిస్తాడు ?

అతడు ఏపనిచేసి నాలుగు రూపాయలు సంపాదించగలడు ?

తను రోజూ రెండు రూపాయల వంతున ఇవ్వటానికి తనకు చిల్లరఖర్చుల కని అమ్మ యిచ్చేవి చాలవు.

ఏంచెయ్యాలి ?

వాడిని చూస్తే పాపమనిపిస్తుంది. ఒకోసారి కన్నీళ్లొస్తాయి.

ప్రకాష్ చదువుతున్నాడు. కాని ఏంచదివాడో అతడికే జ్ఞాపకం లేదు. ''ఇవాళ బెస్టుకూడాను'' అనుకున్నాడు.

స్కూలుకు వెళ్ళేటప్పుడు తనకు చాలని పాయ్‌జామా బుష్‌షర్టూ అల్మెరాలో నుంచి తీసి మడిచి పుస్తకాల సంచీలో పెట్టుకున్నాడు. తొమ్మిది గంటలు కాగానే భోజనం చేసి తల్లిని పిలిచాడు.

"అమ్మా, ఇవాల్టినుంచి. నా టిఫిన్‌కారియర్ నేనే తీసుకుపోతాను. నీవు పంపించేటప్పటికి నాకు ఆలస్యమవుతోంది. కారియరు సిద్ధం చెయ్యమను'' అని నిలబడ్డాడు ఎదురుగా.

"రెండు రొట్టెలు ఎక్కువ పెట్టమన్నాను. మర్చిపోయేవు.''

"పెట్టించాను. చూడు" అని తీసిచూపించింది.

గబగబా సైకిల్‌కి తగిలించుకుని బయలుదేరాడు. దారి పొడుగునా ఆలోచిస్తూ వెళ్తున్నాడు.

నిజానికి ఈ రెండు రొట్టెలూ కూర అతడికేం సరిపోతాయి? రాత్రి భోజనానికి రెండు రూపాయలిస్తే సరిగ్గా సరిపోతాయేమో? ఇవాల్టికి రెండురూపాయలు తన అల్మేరా అంతా వెతికి వెతికి బైటికి తీశాడు.

మరి రేపటికి?

ఇప్పుడీ రొట్టెలుతింటే మధ్యాహ్నానికి ఆకలి కాదూ పాపం?

గిర్రున సైకిల్‌ని వెనక్కు తిప్పాడు. తను నిరుడు చదువుకున్న పుస్తకాలు తన టేబుల్ సొరుగులో ఉన్నాయి. వాటిని నాలుగింటిని సంచిలో కుక్కుకున్నాడు.

స్కూలుకు వెళ్ళగానే అతడికి రొట్టెలు కూర కాగితంలో మడిచి ఇచ్చాడు. తను తీసుకువచ్చిన పాయ్‌జామా బుషర్టూ ఇచ్చి తొడుక్కోమన్నాడు.

తను క్లాసురూమ్‌కి వెళ్ళాడు. అదృష్టవశాత్తు క్లాసుటీచరు ఇంకా రాలేదు.

మధ్యాహ్నం గబగబా భోజనంచేసి క్లాసురూములన్నీ వెతికి తన పుస్తకాలు కావాలన్న పిల్లవాడికి వాటినందించాడు.

"ఈ పుస్తకాలు ఎక్కడా దొరకటం లేదన్నావుట. మా స్నేహితుడు చెప్పాడు. నాదగ్గరున్నాయి తీసుకో. అవి మొత్తం ఇరవైరూపాయలు. నేను ధరలు తగ్గించి ఇస్తున్నాను'' అన్నాడు.

ఆ విద్యార్థి పుస్తకాలు దొరక్క చాలా కష్టపడుతున్నాడు. ఒకరి పుస్తకాలు ఇంకొకరికి ఎవరిస్తారు? ఎంత స్నేహితులయినా ఇవ్వమని నిర్మొహమాటంగా

చెప్పారు. ప్రకాష్ పుస్తకాలు ఇవ్వగానే చాలా సంతోషపడి సైకిల్ మీద ఇంటికి వెళ్ళి డబ్బు వెంటనే తెచ్చిఇచ్చాడు. ఆ ఇరవై రూపాయలూ తీసుకెళ్ళి రామన్న కిచ్చాడు.

"బాబూ, ఇన్ని రూపాయలు నాకిస్తున్నారా ?"

"అవును. నీవు కడుపునిండా నాలుగైదు రోజులు ఏమైనా కొనుక్కు తింటావు కదా ?"

"ఇన్ని రూపాయలు నాదగ్గరుంటే ఎవరైనాచూసి నాలుగు తన్ని తీసుకుంటారు. పోలీసు చూస్తే దొంగవెధవ అని కాలితో తన్ని తన జేబులో వేసుకుంటాడు. మీదగ్గరే ఉంచుకోండి బాబూ.'' రామన్న అలా అనేటప్పటికి ప్రకాష్‌కి కళ్ళ నీళ్లొచ్చాయి.

"అలా అయితే రోజూ రెండు రూపాయలు తెచ్చి ఇవ్వనా "

''రూపాయలుగా ఇవ్వద్దు బాబూ ! తినటానికి ఏదయినా తెచ్చియివ్వండి చాలు. మొన్న మీరిచ్చిన డబ్బులు తీసుకుని హోటల్‌కి వెళ్తుండగా ఒక ఆయన రెండు అరటిపళ్ళిచ్చాడు. అవి తిని ఇంటికిపోతే ఆ యింటివాళ్లు ఆ రెండు రూపాయలూ లాక్కున్నారు బాబూ'' బాధపడుతూ చెప్పాడు.

''నాకు టైమయింది. క్లాసుకు వెళ్ళాలి. వెళ్లేటప్పుడు కొనిస్తాలే" అంటూ వెళ్ళిపోయాడు.

''ఈ బాబు మంచివాడే. చదువుకుంటున్నాడు. నాకూ కాళ్ళు బాగాఉండి నడకవస్తే నేనూ చదువుకునేవాడిని అమ్మఉంటే ఎంతబాగుండేది? అయినా అమ్మ ఎట్లాఉంటుంది? తిరుపతి కొండమీదికి బస్సులో పోతూఉండగా ప్రమాదంలో చనిపోయింది. తల్లి అరటికాయలమ్మిన డబ్బుతో నన్ను కొండమీదికి తీసుకెళ్ళి స్వామి దర్శనం చేయించి "నా కాళ్ల బాగుచెయ్యమ"ని అడగటానికి వెళ్ళిందట. ఆమె చనిపోయింది. నేను తుప్పలోపడి చెట్లకిందికి పాకుతూపోతే ఎవరోతెచ్చి ఊళ్ళో పడేశారట. ఆ బుద్ధి వాళ్ళకు పుట్టటమే గొప్ప వాళ్ళమంచితనానికి మెచ్చుకోవాలి. అట్లాఅట్లా ఈ ఊరొచ్చిపడ్డా. ఇక్కడ బతకటమేకష్టం అనుకుంటూ పడుకున్నాడు రామన్న ఆ రాత్రి. ప్రకాష్ కొనిచ్చిన రెండరటిపళ్లూ రెండు బన్లూ తినేసరికి కడుపు నిండింది.

ఆరోజు ఖర్చుచేసిన మూడు రూపాయలు పోను పదిహేడు రూపాయలు ఒక కవరులో పెట్టి జేబులో పెట్టుకున్నాడు ప్రకాష్. తెల్లవారి నిద్రలేచేసరికి జ్వరం పేలిపోతున్నది ఒళ్లు తెలియకుండా పడుకున్నాడు. కొడుకు వేళకులేవలేదని తల్లి ఇటూ అటూ తిరుగుతున్నది తండ్రి వచ్చాడు.

''ప్రకాష్ ఏడీ! స్కూలుకు వెళ్ళడూ?''

''జ్వరమండీ ఒళ్ళంతా పేలిపోతున్నది.''

"అయితే డాక్టర్ని పిలుచుకువస్తాన"ని ప్రకాష్ చెయ్యిపట్టుకుచూసి "అమ్మో ఒళ్లు కాలిపోతున్నది" అంటూ కారుతీసుకుని వెళ్ళి డాక్టర్ని పిలుచుకు వచ్చాడు.

డాక్టరు జ్వరంచూసి ''ఊళ్ళో టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మాత్రలు ఇవాళ వాడండి. రేపుకూడా ఇంతజ్వరం జారకుండాఉంటే నన్ను పిలవండి'' వెళ్ళిపోయాడు.

తొమ్మిదిగంటలకు ప్రకాష్ రాకపోయేసరికి రామన్న గేటువైపే చూస్తూ పన్నెండు గంటలవరకూ ఎదురుచూశాడు. కాని ప్రకాష్‌రాలేదు.

ఏడుపులో ఆకలికంటె "రామన్నా! ఇదిగో చపాతీకూర తిను" ఆప్యాయతతో పిలిచి చేతికిచ్చే ఆ కంఠధ్వనికోసం తపించి పోతున్నాడు రామన్న.

ప్రకాష్‌కి పదకొండుగంటలకు మెలకువవచ్చింది. మంచం దగ్గరగా మంచినీళ్లు మందులు పెట్టిఉన్నాయి. తనకేమో లేచేశక్తిలేకుండాఉంది తల్లిని పిలిచాడు.

''లేవకుబాబూ, పక్కమీదనేఉండు బేసిన్ తెచ్చి ముఖం కడిగిస్తా. జ్వరం చూసి మాత్రలేస్తాను. డాక్టరు వస్తారు'' అంటూ వెళ్ళి నీళ్లూ బేసిన్ బ్రష్ తెచ్చి ముఖం కడిగించింది.

డాక్టరు వచ్చాడంతలో. జ్వరంచూసి "నార్మల్‌కి రాలేదు. ఈ మాత్రలే వాడండి. ఆహారం పాలు మజ్జిగ ఇవ్వండి రేపు మళ్ళీవస్తా"నని వెళ్ళిపోయాడు.

మాత్రలేసుకుని చల్లటిపాలుతాగిన ప్రకాష్ చప్పున చేతిగడియారం చూసుకున్నాడు. ఒంటిగంట కావచ్చింది.

''రామన్నకు చపాతీకూర ఇవ్వలేదు. ఆకలితో ఉంటాడుపాపం. ఎట్లా?'' అనుకుంటూ పక్కకు తిరిగి పడుకున్నాడు.

నౌకరు మంచందగ్గరే కూర్చున్నాడు. అతడిని దగ్గరికి పిలిచి రహస్యంగా "మా స్కూలు తెలుసా? గేటుముందర కుంటివాడొకడు కూర్చుని ఉంటాడు. వాడికి నాలుగు అరటిపళ్లు నాలుగు బన్నులు ఈ డబ్బుతో కొనిఇవ్వు. ఎవరికీ చెప్పకు"మని పంపించాడు.

రెండురోజులకే తన దగ్గర డబ్బయిపోయింది.

మరునాడు ఏంచెయ్యాలి? ఆ రాత్రంతా ఆలోచించాడు. తన దగ్గరుండే నౌకరును పిలిచి రహస్యంగా "పాపయ్యా, అమ్మగారిని ఏభయిరూపాయలు నీ భార్యకు పంపించాలని అప్పు అడుగు. నా జ్వరం తగ్గగానే నీకిచ్చేస్తాను. జాగ్రత్తగా తడబడకుండా మాట్లాడు"అని వేడుకుంటున్నట్టుగా అన్నాడు.

పాపయ్య ఇదివరకెప్పుడు ఆమె నడగలేదు. నమ్మకంగా ఇంట్లో ఉంటున్నాడు. కాని అమ్మగారిని అడగటానికి భయపడుతున్నాడు.

పన్నెండుగంటలవేళ ప్రకాష్‌కి ఆహారం మందు ఇవ్వటానికి ఆ గదిలోకి తల్లివచ్చింది.

"అమ్మా జ్వరం ఎట్లాఉంది? డాక్టరు రావటంలేదేం?"

"టెంపరేచరు నూరుమీద నిలబడిఉంది. ఆ మాట ఆయనకు ఫోనులో చెబుతున్నా... ఆ మాత్రలే వాడమంటున్నాడు'' దగ్గరకూర్చుని తలనిమురుతూ ''ఎంతచిక్కిపోయావురా బాబూ. ఏమీ పెట్టటానికి వీలుకాని జ్వరం. ఎప్పుడు తగ్గుతుందో? అనుకుంటూ చేతులూ కాళ్లూ నిమరసాగింది.

"అమ్మా, పాపయ్య నిన్నటినుంచీ ముఖం చిన్నబుచ్చుకుని తిరుగుతున్నాడమ్మా. ఎందుకని అడిగితే వాడి భార్యకు జబ్బుగాఉందని ఊరికి పంపించాడట. వాళ్ళ ఊరినించి మందులకు డబ్బు కావాలంటూ మనిషిని పంపించిందట భార్య. నిన్ను అడగటానికి భయపడుతున్నాడమ్మా. పాపం నీవు ఇవ్వరాదూ ఆ ఏభయి రూపాయలు? జీతంలో తీర్చుకుంటానంటున్నాడు''

''ఏడీ పాపయ్య? నాతో ఈ సంగతి చెప్పలేదే? చూద్దాం రేపిస్తాలే" అంది మామూలుగా.

"అది కాదమ్మా, ఆమనిషి వెళ్ళిపోవాలట. పాపయ్య భార్యకు మందులు చాలా అవసరంట. ఎట్లాగో సర్దుబాటు చెయ్యమ్మా పాపం."

ప్రకాష్‌కి తొందరగాఉంది పన్నెండు గంటలకయినా రామన్నకు కడుపు లోకి ఏదన్నాపడాలి.

నీరద బీరువాతెరచి ఏభయి రూపాయలనోటు పాపయ్యనుపిలిచి ఇచ్చింది. "నీ భార్యకు జబ్బుచేస్తే నాకెందుకు చెప్పలేదు? ఇక్కడే ఆసుపత్రిలో చూపించే దాన్నిగా? ఊరికి పంపిస్తావా? అక్కడి మందులతో జబ్బు నయమవుతుందా?" అని మందలించింది.

పాపయ్య వెంటనే ఆనోటందుకుని ఆమెకు దణ్ణంపెట్టి, ప్రకాష్ చెప్పినట్టు చేసి, మిగతాడబ్బు తెచ్చిఇచ్చాడు.

ప్రతిరోజూ నీరద పగలుపడుకున్నప్పుడు పాపయ్యను స్కూలుకు పంపించి రామన్నకు కావలసినవి అందిస్తున్నాడు ప్రకాష్.

ప్రకాష్ జ్వరం ఇరవైఒక్క రోజు దాటితేగాని నార్మల్‌కిరాలేదు. వచ్చిన తరువాత రెండు రోజులుచూసి పథ్యంపెట్టారు. బలంపట్టటానికి ఇంజక్షన్లు ఇచ్చే వాడు డాక్టరు.

ప్రకాష్ చాలా బలహీనంగాఉండి లేచిసరిగా తిరగలేకపోతున్నాడు. మనిషి తెల్లబడిపోయాడు. తలవెంట్రుకలు సగానికిపైగా రాలిపోయాయి. అయినా మెల్లగా పాపయ్య సహాయంతోలేచి తన డ్రాయరులో ఉన్న పాత పుస్తకాలను మరికొన్ని తీసి స్కూల్లో పిల్లలకు అమ్మించాడు.

"బాబుగారూ రామన్నకు చదువువచ్చా?" అని అడిగాడు పాపయ్య ఒక నాడు.

దిగ్గునలేచి ప్రకాష్ "పలకమీద పుస్తకంచూసి రాస్తున్నాడా? మాటలా? వాక్యాలా?" ఆశ్చర్యపోయాడు.

"ఏదో బాబుగారూ పలకనిండా రాస్తున్నాడు."

"పాపం. ఈ నెలరోజుల చదువు పోయినట్టేగా? లేకపోతే ఆ పుస్తకం అయి పోవాల్సింది ఈ పాటికి"

నిట్టూర్చాడు ప్రకాష్.

మరొక నెలరోజులకు ప్రకాష్ స్కూలుకు వెళ్ళగలిగాడు. అప్పటికి పదవ క్లాసు పరీక్షలు సరిగ్గా రెండునెలలే ఉన్నాయి కష్టపడి చదువుతున్నాడు.

''ఆరోగ్యం బాగాచూసుకోరా. పరీక్షలు ఈ సంవత్సరం కాకపోతే వచ్చే ఏడాది రాయచ్చు ఆరోగ్యం ముఖ్యం'' తల్లీ దండ్రీ మందలిస్తున్నారు.

''అయ్యో, అట్లాచేస్తే నా జీవితంలో ఒక సంవత్సరం వెనకబడి పోతాను."

''పరావాలేదులేరా? ఆరోగ్యం దెబ్బతింటుందని మా భయం"

''మందులు తీసుకుంటున్నాగా? డజన్ విటమిన్ ఇంజక్షనులు తీసుకున్నాను ఇంకేంపరవాలేదన్నాడు డాక్టరు. ఆయన వద్దంటే అప్పుడుచూస్తాను'' అన్నాడు ప్రకాష్. తన కార్యక్రమంలో మార్పులేకుండా చూసుకుంటున్నాడు.

''రామన్నా, కొత్త పుస్తకంలో ఎంతవరకూ రాశావు?"

''అయిపోవచ్చిందయ్యా.''

అయితే నీవు ఒక్కొక్క పాఠం పదేసిసార్లు చదువు. అట్లాగే రాయి. నేను వచ్చేవారం నీ పుస్తకంలో ఎక్కడడిగితే అక్కడ చెప్పాలి రాయాలి. ''ఇది అయితే ఇంగ్లీషు అక్షరాలు అంకెలూ చెప్తా ఒక పుస్తకాన్నితెస్తా."

"సరేనండయ్యా''

"అబ్బాయి స్కూలునుంచి ఆలస్యంగా వస్తున్నాడండీ రోజూ'' అన్నది నీరద భర్తతో.

"పదోక్లాసుకదా తనకు నెలకుపైగా స్కూలుపోయింది. ఆ పాఠాలు చెప్పించుకుంటున్నాడేమో? కొందరుటీచర్లు పిల్లలకు స్కూలు వేళదాటిన తరువాత కూడా పాఠాలు చెబుతారు అడిగినవాళ్ళకు. అంతా అయిన తరువాత ఆయనకు డబ్బు యివ్వవలసిఉంటుంది. అడిగితే ఇవ్వు'' అన్నాడు.

స్కూలు మూసిన తరువాత రామన్నకు ప్రకాష్ చదువుచేప్పే వేళఅది.

ప్రకాష్కి పరీక్షలు మొదలయ్యాయి. మధ్య సెలవులు-మళ్ళీ పరీక్షలు ఇలా ఇరవైరోజులు సాగాయి.

"నాన్నా పరీక్షలు బాగారాశాను. ఈ సెలవుల్లో పొద్దున ఫుట్‌బాల్, బాడ్మింటిన్ వంటి ఆటలు నేర్పుతున్నారు స్కూల్లో నేనందులో చేర్తానాన్నా'' తండ్రి నడిగాడు.

"దానికేం వెళ్లు. అలిసిపోయినప్పుడు ఏదయినా డ్రింకుతాగు. ఫీజుతీసుకో" మని ముప్ఫయి రూపాయలిచ్చాడు.

పాపయ్య ఎక్కువసేపు ప్రకాష్ గదిలోఉంటాడు. పుస్తకాలుదులపటమో, గది శుభ్రం చేయటమో, లేకపోతే అతడితో చదువునుగురించి అడగటమో-పుస్తకాలలో బొమ్మలుచూడటమో చేస్తూ ఉంటాడు.

పాపయ్య పని అయిన తరువాత అబ్బాయిగారి గదిలో ఉంటాడని పని మనిషికికూడా తెలిసిపోయింది.

ఒకనాడు-పాపయ్యా మీరు ఏంతింటారు?" అడిగాడు ప్రకాష్.

"బియ్యం ధర ఎక్కువగదండీ, జొన్నరొట్టె తింటాం. మాకు అలవాటే జొన్నరొట్టె."

"ఒక మనిషికి రెండుపూటలా జొన్నరొట్టె తింటే ఎంత అవుతుంది ?"

"చవక రోజుల్లో అయితే నా భార్యకూ నాకూ పదిరూపాయల జొన్నలయ్యేవండి. కూరలు ఎప్పుడైనా చేసుకుంటాము లేకపోతే పచ్చడితో తింటామండి. ఇప్పుడయితే మనిషికి ఇరవై చాలవండి."

"పాపయ్యా, నీవు నాకొక స్నేహితుడిలా ఉన్నావు గాని నౌకరువని నేననుకోవటం లేదు. నేను ఇరవై కాదు, పాతికరూపాయలిస్తా. చేసిపెట్టినందుకు పది రూపాయలిస్తా. ఆ రామన్నను నీ యింటివాకిట వరండాలో ఉండనిస్తావా ? నేను ఏదోవిధంగా అతడికి కాళ్ళు పెట్టిస్తా. దానికి కొంచెం ఆలస్యమవుతుంది. మీ వాకిట్లో ఉంటే వాడికి ఒక కర్రకొనిచ్చి గెంతుతూ నడవటం నేర్పుతా. అక్కడో చిన్న స్కూల్లో చదువుకుంటూ ఉంటాడు. చూడు, సీకిష్టమేనా ?"

"అబ్బాయిగారూ, డబ్బిస్తామంటున్నారు. రామన్నంటే మీకు ప్రాణమని తెలుసుకున్నా బాబూ. అట్లాగే రొట్టెలు చేయించిపెడతా. మావాకిటి ముంగిట ఉండనీయండి.''

ప్రకాష్ లేచివచ్చి "రామన్నను నీవుకూడా బాగాచూసుకో, చంక క్రింద కర్రలు పెట్టుకుని నడుస్తాడుచూడు. అవి కూడా కొంటాను. అమ్మకు నాన్నకు చెప్పకు" అని భుజం తట్టాడు.

ప్రకాష్‌కి తండ్రి యిచ్చే డబ్బు రామన్న మీద ఖర్చుచేస్తున్నాడు తన పాత పాయ్‌జామా బుషర్టు ఇంకొకజత అతడికిచ్చాడు. ఆ స్కూల్లో చేర్పించి హెడ్‌మాస్టరుతో మాట్లాడి ఫీజు లేకుండా చేశాడు. ప్రతిరోజూ కనుక్కుంటూ ఉండేవాడు.

సెలవులయిన తరువాత తను ఇంటర్‌లో చేరాడు. అతడు ఇంటరు పూర్తి చేసేసరికి రామన్న ఆరోక్లాసులోకి వచ్చాడు.

ప్రకాష్‌కి మొదటినుంచీ తను డాక్టరుకావాలన్న ప్రబలమైన వాంఛ. తండ్రికి ఇంజనీయర్ని చేయాలన్న ఉద్దేశ్యము. తల్లి దగ్గర చనువు ఎక్కువ. తండ్రి దగ్గరకూడా చనువుగా ఉంటాడు. కాని తేడా ఏమిటంటే తల్లి దగ్గర మారంచేసి మాట నెగ్గించుకుంటాడు.

మెడికల్ కాలేజిలో చేరేనాడు ముందు తల్లికి దణ్ణంపెట్టి, తరువాత తండ్రి దగ్గరికి వెళ్ళి దణ్ణంపెట్టి నిలబడ్డాడు.

"ఒరే ప్రకాష్, నీ కొంటెవేషాలు చూస్తునే ఉన్నా. అమ్మ సిఫారస్‌తో డాక్టరు వవుతాననుకున్నావు కదూ ? నాతో మొదలేచెప్పచ్చుగా !" అంటూ అతడి భుజాలమీద చెయ్యేసి నడిపిస్తూ తల్లిదగ్గరికి తీసుకువెళ్ళాడు.

"వీడు డాక్టరవుతాడట, నీకిష్టమేనా ?" అడిగాడు భార్యను.

"కాదు. వాడు ఇంజనీయరు అవటమే నాకిష్టం" అంది మూతి బిగించి.

"చూడు నేను గెలిచాను. నాకొడుకు డాక్టరు" క్షణంలో హాలంతా నవ్వులతో నిండిపోయింది.

ఆరోజే ఫీజుకట్టి కాలేజిలో చేరాడు. తనకిచ్చిన డబ్బులోనుంచి రామన్నకు పుస్తకాలు కొనిచ్చాడు. ఒక జత కొత్తబట్టలు కొనిచ్చాడు తల్లిదగ్గర కొంత డబ్బు, తండ్రిదగ్గర కొంత డబ్బు తీసుకుని తన ఖర్చులుపోను రామన్నకు చదువూ పోషణా చేస్తున్నాడు.

ప్రకాష్ చెల్లెలు ప్రీతికి తన చదువేమో తనేమో కాని ఏసంగతి అంతగా పట్టించుకోదు. తను ఇంటర్ పాస్‌కాగానే బి.కామ్‌లో చేరింది ఏఅట్టహాసమూ లేకుండా.

ప్రకాష్‌కి రామన్న సంగతి తప్ప మరొక ఆలోచన ఉండదు. ప్రీతికి తన చదువు తప్ప మరొకప్రసక్తి లేదు.

"ప్రీతి చదువును గురించి ఒక్కసారయినా అడిగావట్రా ప్రకాష్ ? అన్నవయిఉండి అంతమాత్రం కనుక్కోకపోతే ఎట్లా ?" అన్నదొకనాడు నీరద.

"బి.కామ్ తరువాత ఎం.కామ్ చదువుతుంది. నాకంటె బాగా చదువుతున్నది. నేనేమడగను ?"

''అన్నగారి నాటకాలన్నీ నాకు తెలుసులే. అన్నా, ఒకసారి పైకి వస్తావా నీతో మాట్లాడాలి" అని మేడమీదికి తీసుకెళ్ళింది ప్రీతి.

"రామన్న ఇప్పుడు ఆరోక్లాసు కదూ ?"

ప్రీతికి తన సంగతి తెలిసిపోయిందని ఉలిక్కిపడ్డాడు ప్రకాష్. ఆమె వంక ఒక మాదిరిగా చూశాడు.

''అలా చూస్తావేం ? నాకు మొదటినుంచి తెలుసు. అయితే నీవెట్లా ఎవరికీ చెప్పకుండా దాచావో నేనూ ఆ సంగతి నాకు తెలియనట్టే ఉన్నాను. రామన్న కాళ్ళకు స్ప్రింగ్‌తో బూట్లపైన మోకాలివరకూ అమర్చేవి చేయించి ఇస్తే క్రచెస్ తోటి నడవగలుగుతాడు. అవి తయారు చేయించు. తరువాత ఇంకోమాట- పదవ క్లాసు అయిన తరువాత కాలేజికి పోయేటట్లయితే ఎవరంతట వాళ్ళు నడుపుకునే రిక్షాలవంటివి ఉపయోగిస్తున్నారు. అది కూడా చేయించు."

ప్రీతి సలహాలకు ప్రకాష్ ఆశ్చర్యపడ్డాడు. ఆమె చెప్పింది నిజమే. ఆ ఏర్పాటు చేస్తే రామన్నకు చాలా సౌలభ్యంగా ఉంటుంది. కాని అంతడబ్బు తన కెక్కడిది ? వాడూ అటువంటి బండి నడుపుకుంటూ బి.కామ్ కాగానే ఏబ్యాంకులో నయినా ఉద్యోగం సంపాదిస్తే తనకు చాలా సంతోషం. కాని, ఇప్పట్లో ఇవన్నీ అయేపనులా ?" అనుకుంటూ కిటికీలోనుంచి బైటికి చూస్తున్నాడు.

"అన్నా, నేను హేళనచేస్తున్నానని అనుకుంటున్నావా? కాదు. మనసారా చెప్తున్నాను."

"అంత డబ్బెక్కడిదమ్మా నాదగ్గర? ఈ పనికోసం నేను పడినపాట్లు ఇన్నీ అన్నీ కావు. ఇప్పటికీ నేను ఎన్ని తగ్గించుకుని రామన్నను ఈస్థితికి తెచ్చానో చెబితే నీవు నమ్మవు.''

"అన్నా, నాకంతా మొదటినుంచీ తెలుసు కాని పైకి చెప్పలేదు. నన్ను కూడా నీతో కలుపుకో. అమ్మ యిచ్చినదంతా నేనూ ఖర్చుపెట్టను, దాచి ఉంచుతాను. నా దగ్గరఉన్న డబ్బుతో బూట్లు చేయించు ముందర. పదవక్లాసు కాగానే బండీ చేయిద్దాము, సరేనా?" అన్నను తనవైపు తిప్పుకుంటూ అన్నది. వెంటనే డబ్బు చేతిలో పెట్టింది.

ప్రకాష్ తన ప్రొఫెసర్‌తో రామన్న కేసును గురించి చెప్పి సలహా ఇవ్వమని కోరాడు. వికలాంగులకు బూట్లుచేసే స్థలం ఎక్కడుంది చెప్పి "అక్కడ చేయించు. క్రచెస్‌తో నడవటం అలవాటు చేసుకోవాలి. అతడు కాలేజిలోకి వచ్చేవరకు బండిచేయించవచ్చు'' అని ప్రకాష్‌కి రామన్నపట్ల కలిగిన అభిమానానికి అభినందించాడు.

ప్రకాశ్ తన చదువేకాకుండా రామన్న చదువుపట్ల కూడా తగని శ్రద్ధ చూపిస్తున్నాడు.

ప్రకాష్ పై క్లాసులకు వెళ్ళుతున్నకొద్దీ ఖర్చులెక్కువవుతున్నాయి. అందరితోపాటు మంచి డ్రెస్సువేసుకోవాలి. ఇటు రామన్నకూ ఖర్చులు పెరుగుతున్నాయి. అందులో అతడికి బూట్లు చేయించటంలో ఇబ్బందిపడ్డాడు. చెల్లెలిదగ్గర అవసరమైనంత లేదు. తల్లిదండ్రులకు చెబితే వాళ్లు ఈ ఖర్చుకు అంగీకరించరేమో?

ప్రకాష్ నాలుగవ సంవత్సరంలోకి వచ్చేసరికి రామన్న పదోక్లాసులోకి వచ్చాడు. అతడికి ఒక సంవత్సరంక్రింద అంగవైకల్యంగల పిల్లవాడని స్కాలర్‌షిప్‌కోసం ప్రయత్నిస్తే ప్రభుత్వంవారు అతడిని వికలాంగుల పాఠశాలకు పంపమని సిఫారసు చేశారు.

ఆ పాఠశాల చాలా దూరం. అదీకాక హాస్టల్లో ఉండాలి. అదంతా కుదిరేపని కాదని తనే డబ్బుకు ఇబ్బందిపడుతున్నాడు ప్రకాష్.

రామన్నకూ తనకోసం ప్రకాష్ ఎంతకష్టపడుతున్నదీ తెలుసు. కాని బాగా చదుకుని ఉద్యోగంచేసి ఋణం తీర్చుకోవాలన్న పట్టుదలతో రాత్రింబగళ్ళు కష్టపడుతున్నాడు.

ప్రకాష్‌కి పరీక్షలు సమీపిస్తున్నాయి. ఒకరాత్రి చాలాసేపు మేలుకున్నందువల్ల అతడికి తలనొప్పి వచ్చింది. ఆ తలనొప్పి అట్లాగే నిలిచిపోయి చదవటానికి వీలుకాకుండా అయింది. మరునాడే తండ్రి అతడిని కళ్ళడాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళాడు. కళ్ళ పరీక్షచేసి కళ్ళకు అద్దాలు వేసుకోవాలని డాక్టరు రాసి యిచ్చాడు.

కళ్ళకు జోడు పెట్టుకున్ననాడు "ఈ కళ్ళజబ్బు నాకు వచ్చింది కనుక నాన్న వెంటనే డబ్బు ఖర్చుపెట్టారు."

ఇదే రామన్నకు వస్తే ?

ఎంత కష్టపడేవాడు ?

రామన్నకు ఏ జబ్బూరాకుండా ఉండాలి. అతడి చదువు నిరాటంకంగా సాగిపోవాలి" అని ఆనాడంతా మనసులో దైవాన్ని ప్రార్థించాడు.

ప్రకాష్‌కి అద్దాలు కళ్ళకు అలవాటయి చదువుమీద ధ్యాస నిలవటానికి నాలుగురోజులు పట్టింది. అది మొదలు కష్టపడి చదువుతున్నాడు. పాపయ్యతో రోజూ రామన్నను బాగా చదవమని చెప్పిపంపుతున్నాడు.

పరీక్షల ముందర విద్యార్థులందరూ ఫీజుకట్టి హాల్ టికెట్ తీసుకోవాలి. ప్రీతి తన చేతిగాజు ఒకటి అమ్మింది. ప్రకాష్ ఫీజుకోసం తండ్రి ఇచ్చిన డబ్బు రామన్న పరీక్షల సమయంలో ముందుగా స్కూల్లో ఉండాలని బండికి ఆర్డరు ఇచ్చారు. తరువాత ఇద్దరూ మధనపడ్డారు.

ప్రకాష్‌కి పరీక్షఫీజు ఎట్లా ?

రామన్న బండికి ఇంకా పైనపడేటట్టుంది.

రాత్రీపగలూ ఆలోచించి ఇద్దరూ ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ పని ప్రీతి చేస్తానని అంగీకరించింది.

మరునాడు కాలేజినుంచి రాగానే ప్రీతి మెల్లగా తల్లిదగ్గర చేరింది.

"ఏమిటి ఇంత ఆప్యాయంగావచ్చి దగ్గరకూర్చున్నావు ప్రీతి? ఏదో ఉంది నీమనసులో. లేకపోతే నీ అంతటనీవురావు" అన్నది నీరద ఆమెను దగ్గరకి తీసుకుంటూ.

"అమ్మా, నాకో సహాయంకావాలమ్మా. నాలుగురోజులనుంచీ ఆలోచిస్తున్నా నిన్నడగలావద్దా అని. నీవు కోప్పడతావేమోనని భయంగాఉంది" అని గునుస్తూ ఒక్కొక్కమాటే చెప్పింది.

"ఏమిటో చెప్పు నేను చేయగలిగిందేనా?"

"నీచేతిలోనేఉందమ్మా నీవు చేస్తానని మాట ఇస్తే చెప్తా"

"చేస్తానమ్మా చెప్పు" చేతిలో చెయ్యివేసింది.

"నా స్నేహితురాలికి పెళ్ళి నిశ్చయమైంది. పెళ్ళికూతురికి నచ్చిన గాజుల జత వాళ్ళమ్మ కొనలేకుండాఉంది. ఆమె దగ్గరున్నడబ్బు పెళ్ళి ఖర్చులకే అతి కష్టమ్మీద సర్దుబాటు చేయవలసివస్తోంది. పెళ్ళికి నాకు ఇష్టమైన గాజులు కొని పెట్టకపోతే ఇంకెప్పుడు కొంటావ"ని మా మాధవి ఒకటే ఏడుపు. ఆ గాజుల జత కోసం తెగ ముచ్చటపడుతోంది పాపం. కొంత దానిదగ్గరఉంది ఒక వెయ్యి రూపాయలు తక్కువ పడతాయి. ఆ మాధవి ఏడుస్తుంటే నాకూ ఏడుపువస్తోంది" అంటూ తల్లి దగ్గర గారాలుపోయింది.

"అయితే నేనేంచెయ్యను?"

"నీవు ఆ వెయ్యిరూపాయలు ఇప్పుడు సర్దుబాటుచేస్తే నెలకింత అవి తీర్చేస్తా నంటోంది. ఒక్క వెయ్యి రూపాయలేకదమ్మా. సర్దలేవా?"

"పదికాదు పాతికకాదు ఒక్కసారి వెయ్యి రూపాయలు సర్దటం మాటలా? ఆ మాధవిమాటలు పట్టుకుని నీవు నన్నడుగుతున్నావు." ఆమె ఇష్టపడనట్లు ముఖం పెట్టింది.

కోపంతో దిగ్గునలేచింది ప్రీతి.

"కూర్చో అన్నిటికీ తొందరపడకు. ఇప్పుడిస్తాననుకో నీవు వసూలుచేసుకు వచ్చి నాకిస్తూఉంటావా?" కచ్చితంగా అన్నట్లంది.

"ఇస్తాను తప్పకుండా నెల నెలకూ తెచ్చిఇస్తాను" అని చెంగునలేచింది. తల్లి దగ్గరనుంచి అంతసొమ్ము వసూలు చేస్తాననుకోలేదు ప్రీతి. డబ్బు తీసుకుని అన్నగారు రాగానే చేతిలో పెట్టింది.

ప్రకాష్ మరునాడే ఫీజు కట్టాడు. మిగిలిన డబ్బు జాగ్రత్తగా దాచాడు.

రామన్న తనకోసం ప్రకాష్ ప్రీతి ఎంతకష్టపడుతున్నారో పాపయ్యద్వారా వింటునే ఉన్నాడు. వాళ్ళ ఋణం తీర్చటానికి ముందు బాగా చదవాలి-పరీక్షలు బాగా రాయాలి మొదటి తరగతిలో నెగ్గితేగాని ప్రకాష్ చెప్పినట్టుగా బి.కామ్‌లో చేరటానికి తగిన అర్హత రాదు. రాత్రింబగళ్లు కష్టపడుతున్నాడు.

చదవటానికి ముగ్గురూ కష్టపడుతున్నారు కాని-ప్రకాష్‌కి రామన్నను గురించిన ఆందోళనవల్ల, మరింత కష్టపడుతున్నాడు. ఒక పక్క ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకొమ్మని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

ముగ్గురూ ఇరవైరోజుల తేడాలో పరీక్షలురాశారు. పెద్ద బరువు తలమీది నుంచి దింపుతున్నట్టు ఊపిరి పీల్చుకున్నారు. తల్లికి అప్పుతీర్చేటందుకు-సెలవుల్లో ప్రీతి పక్క వీధిలో ముగ్గురు పిల్లలను యల్. కె జి కి ట్యూషన్ చెప్పటానికి ఒప్పుకుంది.

ప్రకాష్ తొమ్మిదవ క్లాసు పిల్లలకు లెక్కలు చెప్పటానికి అంగీకరించాడు.

ప్రతిరోజూ కాలేజికి వెళ్ళినట్టుగా మధ్యాహ్నంవేళ ప్రీతి బయలుదేరుతుంది. ఉదయం తొమ్మిది గంటలకు ప్రకాష్ బయలుదేరుతాడు.

పరీక్షాఫలితాలు ప్రీతివి ముందుగా తెలిశాయి. పదవక్లాసు ఫలితాలు వెలువడటానికి కొన్ని అవరోధాలు ఏర్పడ్డాయి. ఎప్పటికయినా వస్తాయికదా అని రామన్న ప్రకాష్ దగ్గరే లెక్కలు నేర్చుకుంటున్నాడు.

ప్రీతి నెలకు నూటఏభయి రూపాయలు తల్లికి అప్పు తీరుస్తున్నది.

"మాట నిలుపుకుంటున్నావు ప్రీతి. నీ భవిష్యత్తు సుఖసంతోషాలతో నిండాలమ్మా" అని కూతురుని గుండెకు హత్తుకుంది నీరద.

ప్రకాష్ నెలకు రెండువందలు రామన్న బండికి కడుతున్నాడు. అతడి కాలేజి తెరిచేవరకూ రామన్న బండి తయారు కావాలని ఆత్రపడుతున్నాడు.

ప్రకాష్ ఉదయం ఏడుగంటలకు కాఫ్యాదులు ముగించుకుని సైకిల్ మీద రామన్న ఇంటికి వెళ్లాడు. పాపయ్య ఎదురుగావచ్చి రామన్న స్నానంచేస్తున్నాడని చెప్పాడు.

"బాగా నడవగలుగుతున్నాడా పాపయ్యా?"

"నడక నేర్చుకుంటున్నాడు బాబూ. మా గట్టిపిల్లవాడు. పట్టుదల ఎక్కువ. చదువులోనూఅంతే. నడకలోనూఅంతే బాబూ. రామన్న పరీక్ష అయ్యాడా?"

"ఆ మాట చెప్పాలనేవచ్చాను. మొదటి తరగతిలో ఎక్కువ మార్కులతో ప్యాసయ్యాడు. బండికూడా ఇంచుమించుగా తయారయినట్టే. తనే నడుపుకుంటూ కాలేజికి పోవచ్చు"

ఈ మాటలు అంటూఉండగా రామన్న స్నానంచేసి విడిచిన బట్టలుఉతికి గడ్డిమీద ఆరవేసుకుని తలదువ్వుకుని వచ్చాడు.

"రామన్నా నీవు పరీక్ష ప్యాసయ్యావు. మార్కులుకూడా బాగా వచ్చాయి కాలేజీలు తెరవగానే నిన్ను ఇంటర్‌లో చేర్పిస్తాను."

"బాబూ ఫీజులు కావాలికదా. నాకోసం ఎంతని ఖర్చు పెడతారు?"

"నేను చూసుకుంటాగా అదంతా. నీ పని చదువు పూర్తిచేయటం పాపయ్యా మీరిద్దరూ సినిమాకు వెళ్ళిరండి రామన్న ఎప్పుడైనా చూశాడోలేదో?" అంటూ పది రూపాయలు చేతిలో పెట్టాడు.

అతడు ఇంటికిరాగానే ప్రీతి అతడిచెవిలో ఏదో మాటచెప్పింది. సంతోషంతో ఇద్దరూ సైకిళ్ళమీద బయలుదేరారు. రామన్నకు బండీ తయారయింది రంగులుకూడావేశారు. చూడటానికి రిక్షాలా కనబడుతుంది. కాని స్వయంగా నడిపే ఏర్పాట్లు లోపల అమర్చారు.

"తీసుకెళ్ళండి బాబయ్యా. ఇది నాలుగో బండి. నేను తయారుచేసిన మూడు బండ్లు బాగా నడుస్తున్నాయి. ఈ బండి వాటికంటె మా బాగా తయారు చేశానయ్యా" అంటూ ప్రకాష్ ఇచ్చిన డబ్బు తీసుకుని కళ్ళకద్దుకున్నాడు.

"దీన్ని మేమెట్లా తీసుకెళ్ళగలం ? నీవు నడుపుకుంటూ మావెంటరా" అని అతడిని బండితోకూడా తీసుకెళ్ళి రామన్నకు చూపించారు. రామన్న బండి నడపటం అతడి దగ్గరే నేర్చుకున్నాడు.

పాపయ్య, రామన్న అదృష్టానికి పొంగిపోయాడు.

రామన్న కాలేజిలో చేరిననాడు ప్రకాష్ ప్రిన్సిపల్ గదిలో గంటసేపు కూర్చుని రామన్న కథంతాచెప్పి స్కాలర్‌షిప్పు ఇప్పించమన్నాడు. పేదవాడే కాకుండా అవిటివాడుకదా అని కనికరించమని కోరాడు. ఆయన ముందు ఫీజు కట్టి చేర్పించితే తరువాత చూస్తానన్నాడు. ప్రకాష్ ఇతరత్రా స్కాలర్‌షిప్పువచ్చే విధానాలను గురించి ఆలోచిస్తూ అప్పటికి ఫీజుకట్టి చేర్పించాడు. రామన్న పాత పుస్తకాలను అమ్మి మరికొంతడబ్బు చేర్చి అవసరమయిన పుస్తకాలు కొనిచ్చాడు.

ఇదంతా జరిగేసరికి నాలుగురోజులు పట్టింది.

ఇంటికి రాగానే అతడికి ఇంకేదోపని మిగిలిపోయినట్లనిపించింది. జేబులు తడుముకున్నాడు. ఏభయిరూపాయలనోట్లు చేతికితగిలాయి. మెల్లిగా ప్రీతిగదిలోకి వెళ్ళి "ప్రీతీ. నీవు నీచేతిగాజు అమ్మావు. ఇదిగో అన్నిఖర్చులుపోగా మిగిలిన డబ్బు. మిగతావి నీవు వేసుకుని చేయించుకో. నేను మళ్ళి ఇస్తాలే." అన్నాడు.

కొత్త విశేషాలేవీ లేకుండా తను మెడికల్ కోర్సు ముగించుకుని జూనియర్ డాక్టరయ్యాడు. పోస్టుగ్రాజ్యుయేటు కావాలని సర్జరీకి అప్లైచేశాడు.

ప్రీతి ఎం కామ్ పూర్తిచేసి సి.ఏ చేయాలని ఒక చార్టర్డుఎక్కౌంటెంటు దగ్గర ఎప్రెంటిస్‌గా చేరింది.

రామన్న మెల్లగా తనబండీ నడిపించుకుంటూ ప్రకాష్‌చేత ఫీజుకట్టించుకుంటూ బి.కామ్ పూర్తిచేశాడు.

రామన్న బ్యాంకిలో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడు, ఆనాడు ఇంటర్వ్యూ.

రామన్న ప్రకాష్ కుట్టించిన సూట్‌లో నిగనిగలాడే షూజ్‌వేసుకుని క్రచెస్ సహాయంతో నడుస్తూ తనపేరు పిలవగానేవెళ్లాడు. తన సర్టిఫికెట్లన్నీ చూపించాడు. ఇంటర్వ్యూలో ఒకమెంబరడిగాడు-"నీ గార్డియన్ ఎవరు ?" అని.

"నాకు తలిదండ్రులులేరు. నాకు చదువు చెప్పించిన ఆయన డాక్టర్ ప్రకాష్. అయనే నా గార్డియన్." అన్నాడు.

"నీ స్కూలు చదువు ఎలా నడిచింది ?"

"క్రచెస్‌తో నడిచివెళ్ళేవాడిని. కాలేజి చదువుకు నేను నడపగలబండీని డాక్టరు ప్రకాష్‌గారు చేయించి ఇచ్చారు. అసలు నేను ఒకరోజు డాక్టరుప్రకాష్ గారి స్కూలుముందర కూర్చుని విద్యార్థులను ఏదయినా మిగిలితే పెట్టమని అడుగుతూ ఉండేవాడిని. ఒకరోజు ప్రకాష్‌గారు తన డబ్బాలోనుంచి మిగిలిన దేదో చేతిలో పడేశారు. అప్పటినుంచీ నా భోజనం, బట్టలు, నాకు చదువు ఈ క్రచెస్, స్ప్రింగ్ బూట్లూ, నేను నడుపుకోగల బండీ అన్నీవారిచ్చినవే."

"సరే. వెళ్ళు"

తన ఇంటర్వ్యూ కాగానే రామన్న ఇంటికి వచ్చాడు.

పాపయ్య ఎదురుగా వచ్చి "ఏంరామన్నా. ఉద్యోగం వచ్చేటట్టుఉందా ?" అడిగాడు.

"బాబు గారంటే దయతలిచి నన్నింతవాణ్ణిచేశారు డబ్బుఖర్చుచేసి. కాని- నాకు ఉద్యోగమెవరిస్తారయ్యా ?"

"అప్పుడే నిరాశపడకు. అన్నిటికీ మన బాబుగారే ఉన్నారు."

"ఇంతకాలం నాకు భోజనంపెట్టి, ఉండటానికి స్థలం ఇచ్చావు. నీఋణ మెట్లా తీర్చుకుంటానో ? రేపటినుంచీ నేను నలుగురుపిల్లలకు ట్యూషనుచెప్తాను. కాస్త కుదిర్చిపెట్టు"

"బాబుగారు చెప్పనీ. పిల్లలకేం ? పిల్లలందరూ ఈ రోజుల్లో ట్యూషన్లు చదువుకోనిదే పరిక్ష రాయలేరు."

ప్రకాష్ తను కోరుకున్న సర్జరీలో పోస్టుగ్రాడ్యుఏషన్ చెయ్యటానికి

సెలక్టు అయ్యాడు. ఆ సంగతి తండ్రితో చెబుతూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాడు. ప్రీతికూడావచ్చింది. తల్లివచ్చి తండ్రిపక్కన కూర్చుని, కాఫీ కలిపి కప్పుల్లో పోస్తున్నది.

"నీ కొడుకు పెద్ద సర్జన్ అవుతాడు. కూతురు చార్టర్డ్ ఎకౌంటెంటవుతుంది. చూస్తున్నావా?" అన్నాడు వామనరావు భార్యనుద్దేశించి.

"అలాగా? అయితే మీ కొడుకు ఏంచేస్తున్నాడట? మీ కూతురు పెళ్ళి చేసుకోదా?" అంటూ నవ్వింది నీరద.

"నా కొడుకు ఒకడికి గార్డియన్‌గాఉండి చదువుచెప్పించిన ధర్మాత్ముడు. నా కూతురు వర్తకులకు వ్యాపారస్థులకు ఆదాయవ్యయాల లెక్కలు చూస్తుంది. పెళ్ళంటావా? ఆమెతోటి పనిచేసేవాడే చేసుకుంటాడు"

అని కొడుకువైపు తిరిగి "నీవు ఇంత చిన్నతనంలోనే గార్డియన్‌వయ్యావు. ఎట్లా మేనేజ్ చేశావురా?" భుజమ్మీదచెయ్యేసి అడిగాడు ప్రకాష్‌ని.

అతడు తెల్లబోయిచూశాడు. ప్రీతి అన్నవంక చూస్తోంది ఏం చెబుతాడోనని.

"ఒకరికి గార్డియన్‌గా ఉండేటంతశక్తి వయసూ నాకెక్కడివి నాన్నా?"

"అన్నీ నాకుతెలుసులేరా? నీ చెల్లెలూ నీతోచెయ్యికలిపింది. ఇన్నేళ్ళువచ్చినా నేను చేయలేనిపని-చేయనిపని చిన్నవాళ్ళు మీరిద్దరూకలిసి పెద్ద పనిచేసి చూపించారు. ప్రతివిషయమూ నేను కనిపెట్టి చూస్తునేఉన్నా. నాకు సంతోషంతో మనసు పొంగిపోతోందిరా. ఆఁ అన్నట్టు చెప్పటం మరిచాను. నీవు గార్డియన్‌గా ఉన్న పిల్లవాడు బ్యాంకు ఉద్యోగంలో సెలక్టయ్యాడు. బహుశః ఆర్డరు అందేఉంటుంది. ఆ ఆర్డరు గార్డియన్ ఎడ్రసుకే వచ్చి ఉంటుంది."

''నాన్నా మమ్మల్నిద్దరినీ క్షమించండి నాన్నా. నేను క్షమించటంకాదురా మేము చేయవలసింది మీ యిద్దరినీ అభినందించటం'' అన్నాడు ఆనందంపట్టలేక.

ప్రీతి ప్రకాష్ తల్లికీ తండ్రికి ఒంగి కాళ్ళకు దణ్ణాలు పెట్టారు.

''మాకంటె గొప్పపనిచేసి ఘనులనిపించుకున్నారు. మాకెందుకురా దణ్ణాలు? ఆ దైవానికి పెట్టండి?" అన్నారు భార్యాభర్తలిద్దరూ.

---